క్లుప్తంగా

ఫ్యాను గుర్తుకు ఓటేయండి

తోట్లవల్లూరు: ఫ్యాను గుర్తుకు ఓటేసి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, సర్పంచ్ పెనుమత్స రాధిక ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తోట్లవల్లూరులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజామణి, రాధిక శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ పీఏస్ కోటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పడమట హరిప్రసాద్, కన్స్యూమర్ సొసైటీ చైర్మన్ రావులపల్లి వాసు, నాయకులు రూబెన్, సాయి, సుబ్బారావు పాల్గొన్నారు.

9న ఆలయ భూముల కౌలు వేలం పాట

పామర్రు: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పామర్రులో ఉన్న ఆలయ భూములకు ఈ నెల తొమ్మిదో తేదీన కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి కె.వెంకటరెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన 6-70 ఎకరాల మాగాణి భూమికి ఈ నెల 9వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయం ఆవరణలో మూడు సంవత్సరాల కాలపరిమితికి భూమిలో వ్యవసాయ పంట వేసుకునేందుకు కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాటలో పాల్గొనే వారు రూ.10వేల ధరావత్తు చెల్లించాలని తెలిపారు. స్థానిక శ్రీసోమేశ్వరస్వామి వారి దేవస్థానానికి సంబంధించిన 5-57 ఎకరాల భూమికి మూడేళ్ల కాలం పరిమితికి ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాటలో పాల్గొనే వారు రూ.10వేల ధరావత్తు చెల్లించాలని, హెచ్చు పాట దారుడు అడ్వాన్సు కౌలు చెల్లించి భూమిలో దిగాలని తెలిపారు.

పూరిళ్లు దగ్ధం

పెదసనగల్లు(మొవ్వ): మొవ్వ మండలం పెదసనగల్లులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంతో జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పశువుల చావడి, ఓ ఇల్లు కాలిపోయాయి. ఆ గ్రామానికి చెందిన శిరివరపు మీనాకుమారికి సంబంధించిన పశువుల పాకలో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న కోడే శేషు తాటాకు ఇంటికి వ్యాపించడంతో ఆ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. మంటలకు గాలులు తోడవటంతో పక్కనే ఉన్న గడ్డి వాములకు వ్యాపించాయి. ఫైర్ అధికారి శ్రీనివాసరావు, ఫైర్ సిబ్బంది యోగానంద్, వెంగళరావు, పూర్ణ చంద్రరావు ఆ మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఇన్‌చార్జి ఫైర్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

నాని విజయం కోసం పూజలు



గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్‌లోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో పట్టణ వెలమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి అమ్మవారు విజయాన్ని చేకూర్చాలని శుక్రవారం పూజలు నిర్వహించినట్లు వెలమ సంఘం నాయకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి చింతల భాస్కరరావు, సంఘం నాయకులు గులిపల్లి ప్రభాకరరావు, వంగపండు బాబు, బ్రహ్మాజీ, రామానాయుడు, వై. రామారావు, బి. హరి, బి. జగన్, డి. రవితేజ, సింగిరెడ్డి గగారిన్, మరడాని వెంకటేశ్వరరావు, వీరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

దంపతులపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: దంపతులపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు కానూరు ఎండోమెంట్‌కాలనీలో కర్రి విజయ భర్త చెన్నకేశవరావు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. పూర్వీకుల ఆస్తిలో విజయకు వచ్చిన వాటాలో పక్కనే ఆడపడుచుకు ఇంటి స్థలం వచ్చింది. ఆడపడుచు కూడా ఇల్లు కట్టుకుంది. కాగా ఆడపడుచు ఇంటి ఎదురుగా కంకర గుట్ట ఉందని ఆడపడుచు కుమారుడు పృథ్వీ తల్లిదండ్రులకు చెప్పటంతో ఆడపడుచు భర్త ప్రసాద్ వచ్చి విజయ, ఆమె భర్త చెన్నకేశవరావుతో గొడవ పడి, కుమారుడు పృథ్వీతో కలిసి దంపతులపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

సీఎం జగన్‌కు పేదలపై ఎనలేని ప్రేమ



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కొడాలి నానికి హారతి ఇస్తున్న మహిళ

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు: దేశంలో ఏ నాయకుడికీ లేనంతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలపై ప్రేమ ఉందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ఆయన మండలంలోని మామిడికోళ్ల, లంకాదొడ్డి, పెసరమిల్లి, వెణుతురుమిల్లి, కూరాడలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేస్తే సంక్షేమ పథకాల కొనసాగింపు జరుగుతుందన్నారు. పొరబాటున చంద్రబాబు కూటమికి ఓటేస్తే పథకాలన్నింటికీ ముగింపేనని స్పష్టం చేశారు. మరొక 10 రోజుల్లో జరిగే ఎన్నికల కురుక్షేత్ర రణరంగం కేవలం ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించడానికి మాత్రమే కాదన్నారు. ఇంటింటికీ అందించే సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం జరుగుతుందన్నారు. పొరబాటున టీడీపీకి ఓటేస్తే మోసపోతారని ప్రజలను హెచ్చరించారు. 93 శాతం పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన సీఎం జగనన్న పాలనలోనే వచ్చాయన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో అంతర్జాతీయ విద్యా కోర్సులను ప్రభుత్వం తెచ్చినట్లు తెలిపారు. అక్కచెల్లెమ్మలను దేశానికే ఆదర్శంగా తీర్చి దిద్దినట్లు పేర్కొన్నారు. ఆసరా, సున్నా వడ్డీ, చేయూతతో అక్కచెల్లెమ్మలను ఆదుకున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యాన్ని సంపూర్ణంగా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రజలందరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై నొక్కి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాని విజ్ఞప్తి చేశారు. తొలుత ప్రజలు కొడాలి నానికి స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ డైరెక్టర్ చిత్తర్వు నాగేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, నాయకులు పాలడుగు రాంప్రసాద్, గిరి బాబాయ్, బాబ్జి, శేషుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు శాయన రవి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు అల్లూరి లక్ష్మణరావు, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం జాన్‌బెన్నీ, ఎంపీపీ కొడాలి సురేష్, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ ప్రభాకరరావు, కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి పాల్గొన్నారు.



కొడాలి నానికి పూలమాల వేసి ఆహ్వానిస్తున్న నాయకులు

పేదల పక్షపాతి సీఎం జగన్



ఐనంపూడి ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ముళ్లపూడిలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: పేదల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే పెత్తందార్లు తట్టుకోలేక పోతున్నారన్నారు. కూటమి మేనిఫెస్టో బూటకమని, చంద్రబాబు చెప్పినవి ఎప్పుడూ చేయలేదన్నారు. మండలంలోని వేల్పూరు, ముళ్లపూడి, ఐనంపూడి, హనుమంతపురం, కపిలేశ్వరపురం, మంటాడ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. యువత భారీ బైక్ ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు పట్టారు. ఐనంపూడి ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీకి ఓటమి భయం పట్టుకొందన్నారు. దీంతో కుట్ర రాజకీయాలకు తెరలేపినట్లు పేర్కొన్నారు. సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి తనను, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణకుమారి, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, సర్పంచ్‌లు పక్కాల అంజిబాబు, యేనుగ బేబి, కలపాల రాంబాబు, బులా నాగమణి, ఎంపీటీసీలు మరీదు రాజ్యలక్ష్మి, కంచర్ల అంకకుమారి, మేరుగ లక్ష్మి, నాయకులు మస్తాన్‌రావు, శ్రీను, బోసుబాబు, వెంకటేశ్వరరావు, సాంబశివరావు, ప్రసాద్, శ్రీనివాసరావు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

తోట్లవల్లూరు: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు తనయుడు సింహాద్రి రామ్‌చరణ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంక, వల్లూరుపాలెం శివారు కాళింగదిబ్బలంకలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, పెదపారుపూడి జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు హరీష, సర్పంచ్ ప్రభుదాస్, ఎంపీటీసీ సభ్యురాలు అనురాధ పాల్గొన్నారు.



తోడేళ్లదిబ్బలంకలో ప్రచారం చేస్తున్న కైలే జ్ఞానమణి, రామ్‌చరణ్

సంక్షేమ సారథి జగన్ పాలన కొనసాగాలి



మొవ్వ మండలం కొండవరంలో ప్రచారం చేస్తున్న అనిత



ఉండ్రపూడి ప్రచారంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సతీమణి కైలే హేమ లీనా

కొండవరం(మొవ్వ): సంక్షేమ సారథి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగేందుకు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోదరి కె.అనిత ప్రజలను కోరారు. మొవ్వ మండలం కొండవరం గ్రామంలో శుక్రవారం ఆమె సర్పంచ్ కొసరాజు జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి, పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖరరావు, కైలే అనికుమార్‌కు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షురాలు రాజులపాటి పార్వతి, నాయకులు శివకుమార్‌తో పాటు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉండ్రపూడిలో..

ఉండ్రపూడి (పామర్రు): సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సతీమణి కైలే హేమలీనా పేర్కొన్నారు. మండలంలోని ఉండ్రపూడిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుపై తమ రెండు ఓట్లను వేసి వైఎస్సార్ సీపీ బలపర్చిన మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖరరావు, పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ కె స్వరూప రాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, మట్టా శ్రీలక్ష్మి, తోట పోలాక్షి, రాంబాబు పాల్గొన్నారు.



పామర్రులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ సోదరుడు జగదీష్ సతీమణి అమృత

పామర్రులో..

పామర్రు: ఆచరణసాధ్యం కాని, మోసపూరిత చంద్రబాబు మేనిఫెస్టోని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రానున్న ఎన్నికల్లో జగన్‌ను సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోదరుడు కైలే జగదీష్ సతీమణి అమృత పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై తమ అమూల్యమైన రెండు ఓట్లు వేసి మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ, వార్డు మెంబర్లు కోటయ్య, తాడిశెట్టి కుమార్, పార్టీ నాయకులు బి.అప్పిరెడ్డి, కృష్ణారెడ్డి, శివశంకర్, జువ్వనపూడి దివ్య హస్మతుల్లా, కూసం పెద వెంకటరెడ్డి, అంజిరెడ్డి, సుబ్రమణ్యం, రత్నకుమారి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే గారూ.. ఈ రోడ్డు మీ ప్రభుత్వమే వేయించింది'



గుడ్లవల్లేరు: మండలంలోని మామిడికోళ్లలో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి ఒక మహిళ ఎదురై రోడ్డు మీదకు వచ్చి సార్.. ఈ రోడ్డును మీ ప్రభుత్వమే వేయించిందని చెప్పారు. ఆ గ్రామంలో జరిగిన అభివృద్ధిని ప్రజలే చెప్పటం సామాన్యులే ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధికి స్టార్ క్యాంపియెనర్లగా మారిన తార్కాణం కనబడింది.

మూడు ఎకరాల గడ్డివామి దగ్ధం

దేవరకోట(ఘంటసాల): మండలంలోని దేవరకోట గ్రామంలో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు అందించిన వివరాల మేరకు.. దేవరకోట గ్రామానికి చెందిన బోలెం శ్రీనాగ వేణుగోపాలరావుకు చెందిన మూడు ఎకరాల గడ్డివామి గురువారం అర్ధరాత్రి 12.30 సమయంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి అంటుకున్నాయి. దీంతో స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. మొవ్వ ఫైర్ సిబ్బంది ఇంజిన్ సాయంతో మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.40 వేల ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని వీఆర్వో నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు.

నయవంచన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: గత 10 సంవత్సరాల బీజేపీ పాలనలో దేశ ప్రజలు నయవంచనకు గురయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో 10 సంవత్సరాల నిరంకుశ పాలన, ధారుణ మోసాలు వివరిస్తూ ముద్రించిన నయవంచన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు పెరుగుదల, పేద, మధ్యతరగతి ప్రజలు నిర్లక్ష్యానికి గురికావడం, రైతాంగం తీవ్ర సంక్షోభాలను ఎదుర్కోవడం, కనీస మద్దతు ధర చట్టబద్ధత చేయకపోవడం, రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజలను మభ్యపెట్టడం, కార్పొరేట్ సంస్థలకు ప్రజల సొమ్ము దోచిపెట్టడం, అంతులేని అవినీతి, మతం ముసుగులో రాజ్యాంగ విధ్వంసానికి తెరలేపడం తదితర అంశాలు ఈ పుస్తకంలో పొందుపర్చామన్నారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి. రజిని, సీపీఎం నాయకులు పి. వీరమ్మ, పల్లపు ప్రభుదాసు పాల్గొన్నారు.

రేపు కొల్లేటి గ్రామాల్లో ఎమ్మెల్సీ పర్యటన

మండవల్లి: మండలంలోని కొల్లేటి గ్రామాలైన శ్రీరాంనగరం, పెనుమాకలంక గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆయన కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కొల్లేరు పెద్దలు పాల్గొనాలని వారు కోరారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్వో శ్రీదేవి

పామర్రు: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు శనివారం నుంచి పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకోవచ్చని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బూసి శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ పామర్రు (ఎస్సీ) 77వ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటుహక్కు కలిగి ఫారం-12 అప్లై చేసిన వారందరూ స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లోని నాలుగు కౌంటర్లలో తమ ఓటు హక్కును ఈ దిగువ తెలిపిన తేదీల్లో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. శనివారం పీఓ/ఏపీఓ సిబ్బందికి , 5వ తేదీన ఆదివారం ఓపీఓ సిబ్బందికి, 6వ తేదీ సోమవారం పోలీస్/ఏవీఈఎస్, ఎస్‌సీసీ/ఎన్‌ఎస్‌ఎస్, ఆర్వో స్టాఫ్, మెడికల్, ఇతరసిబ్బంది తమ ఓటు హక్కులను వినియోగించుకోవాలని తెలిపారు. ఏదైనా కారణం చేత పైన తెలిపిన తేదీల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోని వారు ఈ నెల 7,8 తేదీల్లో 77-పామర్రు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఫారం-12 అప్లై చేసిన వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

పింఛన్ కోసం వృద్ధుల ఇక్కట్లు



మొవ్వ ఇండియన్ బ్యాంకు వద్ద పింఛన్ కోసం వేచి చూస్తున్న వృద్ధులు

మొవ్వ: ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్లను వలంటీర్లు అందిస్తుంటే చూసి ఓర్వ లేని చంద్రబాబు అండ్ కో చేసిన కుయుక్తులకు పడరాని పాట్లు పడుతున్నాం అంటూ వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ వృద్ధుల పడిగాపుల మధ్య సాగుతున్నాయి. శుక్రవారం సైతం వృద్ధులు పింఛన్ కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయటం, క్యూలో బారులు తీరిన సన్నివేశాలు దాదాపు మండల పరిధిలోని అన్ని బ్యాంకుల్లో దర్శనమిచ్చాయి.

ఎమ్మెల్యే డీఎన్నార్ త్వరగా కోలుకోవాలి



డీఎన్నార్ కోలుకోవాలని ప్రార్థనలు చేస్తున్న చిన్న మసీదు ముస్లింలు

కైకలూరు: ప్రచారంలో ఎండ వేడిమికి అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) త్వరగా కోలుకుని క్షేమంగా తిరిగి రావాలని స్థానిక చిన్న మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ హమీద్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మూసా, ఎండీ నురుద్దీన్, ఎండీ ఖాసిం, ఎండీ కలాం, జావూరు రహమాన్, ఇమామ్ వసీం, ముబీన్ పాల్గొన్నారు.

రోడ్డ ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: తాడిగడప వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడపలో ఎండీ సుల్తాన్‌ఖాన్ నివాసం ఉంటున్నాడు. అతను ఈ నెల 2న తాడిగడప నుంచి తాడిగడప డొంక రోడ్డు మీదుగా పప్పుల మిల్లుకు వెళ్లటానికి బైక్‌పై బయలుదేరాడు. అయితే అతను డొంక రోడ్డులో ప్రయాణిస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన కారు అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో సుల్తాన్ తలకు గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పింఛన్ లబ్ధిదారుల కష్టాలకు చంద్రబాబే కారణం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: మండుటెండలో రూ. 3 వేలు పెన్షన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతూ నానా ఇబ్బందులకు గురికావడానికి చంద్రబాబు నాయుడే కారణమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. వలంటీరు వ్యవస్థ ద్వారా సూర్యుడు ఉదయించక ముందే ఇంటి వద్ద పెన్షన్ తీసుకోవడానికి అలవాటు పడిన వృద్ధులు 43 డిగ్రీల ఎండలో బ్యాంకుల కౌంటర్ల వద్ద బారులు తీరి అగచాట్లు పడుతున్నారన్నారు. ఎంతో మంది బ్యాంకు ఖాతాలు నిరుపయోగంగా ఉన్న కారణంగా వారికి పెన్షన్ డబ్బు ఎప్పుడు చేతికి వస్తుందో తెలియని అయోమయంలో పడి ఆవేదన చెందుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు చేసిన ఈ దుర్మార్గపు పనికి వృద్ధులు దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. ఇన్ని కష్టాలకు గురిచేసిన చంద్రబాబు నాయుడుకు తాము ఓటు ద్వారా బుద్ధి చెబుతామని వృద్ధులు అంటున్నారని వారి ఉసురు తగిలి చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌కుమార్, టీడీపీ నామరూపం లేకుండా పోవడం ఖాయమన్నారు. ఈ ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. తిరిగి వలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించి అవ్వాతాతలకు వేకువ జామునే పెన్షన్ అందుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చుండూరి శేఖర్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల కో-ఆర్డినేటర్ కె.ఆంజనేయ ప్రసాదు, నాయకులు దాసరి నారాయణ, వెంపటి సైమన్, కొలుసు నరేంద్ర పాల్గొన్నారు.